క్లుప్తంగా

మినిమం టైంస్కేల్ ఇవ్వాల్సిందే

తిరుపతి కల్చరల్: మినిమం టైంస్కేల్ ఇస్తామన్న హామీని నెరవేర్చాలని ఉద్యమిద్దామని ఏపీ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఏవీ.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం యూనియన్ జిల్లా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరికీ మినియం టైంస్కేల్ ఇస్తామని చెప్పారని, ఇప్పుడు జీవో 2 పేరుతో ఆర్థిక శాఖ అనుమతి ఉన్న కొంతమందికి మాత్రమే వర్తింప జేయడం తగదన్నారు. గ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కోరారు.

వెటర్నరీ విద్యార్థులకు గౌరవ వేతనం పెంచాలి

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ విద్యార్థులకు గౌరవ వేతనం పెంచాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జూడాలు 14 రోజులుగా నిరసన తెలుపుతున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వారి డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు మోహన్, సహాయ కార్యదర్శి చంద్రనాయక్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు ఓం రాజ్, పులికొండ, విష్ణు, అశోక్ రవి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి సమస్యలు వివరిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ: నెల్లూరు పర్యటనలో భాగంగా ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు కలిశారు. వర్సిటీలోని పలు సమస్యలను మంత్రికి వివరించారు. ఉద్యోగుల వేతనాల కోసం రూ.37 కోట్లు విడుదల చేయాలని కోరినట్టు సమాచారం. అధికారుల నుంచి వినతి పత్రాలు స్వీకరించిన ఆయన త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

శ్రీకృష్ణదేవరాయలుకు నివాళి



తిరుపతి గాంధీ రోడ్డు: శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను ఆదివారం బీజేపీ నాయకులు తిరుపతి లీలామహల్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని నలుదిశలా చాటిన గొప్ప రాజు శ్రీకృష్ణదేవరాయలని కొనియాడారు. ఆ పార్టీ నార్త్ మండల అధ్యక్షుడు లోక ప్రభాకర్ నాయుడు, తూర్పు మండల ప్రధాన కార్యదర్శి తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, యువ మోర్చా నాయకులు రాజశేఖరరెడ్డి, కస్పా పద్మనాభం, కృష్ణారావు, రెడ్డెప్ప నాయుడు, చెన్నూరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై సూర్యనారాయణుడి విహారం

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతి అమ్మవారి అనుబంధ ఆలయంలో కొలువైన సూర్యనారాయణస్వామి ఆదివారం తిరుచ్చిపై కొలువై నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు. స్వామివారి జన్మనక్షత్రం హస్త నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 4.30 గంటలకు సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. అనంతరం నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు.

శ్రీరామ విశ్వరూప దర్శనం

పాకాల : మండలంలోని దామలచెరువు సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామ విశ్వరూప దర్శనం కల్పించారు. స్వామి, అమ్మవార్లను సుందరగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయానికి భక్తుడైన ఆంజనేయుడు సీతారామ, లక్ష్మణులకు ఆహారంగా మామిడి ఫలాలను అందించిన దివ్య క్షేత్రంగా ప్రసిద్ధి. సూర్య జయంతి రోజున ఈ ఆలయంలో శ్రీరాముల వారి గర్భాలయంలోకి సూర్య కిరణాలు ప్రవేశించాయి. మంచు తెరలు పూర్తిగా తొలగినందున మాఘ పౌర్ణమి తర్వాత నాలుగో రోజున సంపూర్ణ సూర్య కిరణాభిషేక సేవలో భక్తులకు దామలచెరువు శ్రీరాముల వారు విశ్వరూప దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రద్ధ ట్రస్ట్ సభ్యులు రెడ్డెప్పరెడ్డి, రఘునాథ నాయుడు, చక్రపాణి, సురేంద్ర, ప్రసాద్, బాబు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు గంగ నీటి కోసం అలమటిస్తున్న ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలు (వ్యూ ఫొటో)

అందని ద్రాక్షలా తెలుగు గంగ

తిరుపతి నగరం మొత్తానికి తెలుగు గంగ నీరు మంగళం నుంచే సరఫరా అవుతోంది. కళ్ల ముందే నీరు సరఫరా అవుతున్నా వాడుకోలేని దుస్థితి ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీల ప్రజలది. వారికి నిరంతరం నీటి కష్టాలు తప్పడం లేదు. దీన్ని ఆసరాగా తీసుకున్న పులివర్తి నాని ఎన్నికల్లో తెలుగు గంగను ప్రధాన ఆయుధంగా వాడుకున్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రతి ఇంటికీ తెలుగు గంగ నీరు అందిస్తామని ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా తెలుగు గంగ నీటి గురించి పట్టించుకోలేదు. హామీలన్నీ గాలికొదిలేశారని శెట్టిపల్లి వాసులు ఆరోపిస్తున్నారు.

- ఆరు నెలల్లో నీరు ఇస్తామన్న పులివర్తి నాని
- ఎనిమిది నెలలవుతున్నా ఆలోచన సున్నా
- వందరోజుల్లో అన్న క్యాంటీన్ ఏర్పాటు హామీ గాలికి
- నీటి కోసం శెట్టిపల్లి ప్రజల ఎదురుచూపు



మంగళంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి మంగళం : తిరుపతి అర్బన్ మండలం, చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ పేరుకే పంచాయతీ కానీ ఒక మండల స్థాయికి సరిపడేంత జనాభా ఉంది. ప్రస్తుతం ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీని మంగళం, తిరుమలనగర్, రణధీరపురం, సప్తగిరికాలనీ, కొత్త మంగళం పంచాయతీలుగా విభజించారు. వీటిలో 34 గ్రామాలు, కాలనీలు ఉన్నాయి. ఎక్కువ భాగం అటవీ, కొండ ప్రదేశానికి దగ్గరగా ఉండడంతో నీటి వనరులు తక్కువ. దీంతో ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ ప్రజలను దశాబ్దాలుగా తాగునీటి సమస్య పీడిస్తోంది. ముఖ్యంగా బీటీఆర్ కాలనీ, తిరుమలనగర్, మంగళం క్వార్టర్స్, తుడా క్వార్టర్స్, శేషాచలనగర్, జయశంకర్ కాలనీ, బీటీఆర్ పురం, వెంకటేశ్వరకాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఇక్కడ 34 వేల మందికి పైగా జనాభా ఉంది. ఒక మనిషికి రోజుకు 10 లీటర్ల నీరు, పశుపక్షాదులకు మరో పది లీటర్ల నీరు అవసరమవుతుందని అధికారుల అంచనా. ఈ లెక్కన పంచాయతీకి రోజుకు 22 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుంది. ఎన్నిబోర్లు వేసినా నీరు పడడం లేదు. ఈ నేపథ్యంలోనే పదేళ్ల క్రితం పంచాయతీకి తెలుగు గంగ నీటి సదుపాయం కల్పించాలని జనం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. వారికి ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు మద్దతుగా నిలిచారు. ఆ తర్వాత తెలుగు గంగ నీటి సరఫరా విషయం రాజకీయ అంశంగా మారింది.

అన్న క్యాంటీన్ ఏమైందో..?

పేద ప్రజలకు రూ.5లకే భోజన వసతి కల్పించేందుకు మంగళంలోని ఆర్టీవో ఆఫీస్ సర్కిల్ వద్ద వంద రోజుల్లో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయిస్తానని జిల్లా కలెక్టర్ సమక్షంలో పులివర్తి నాని హామీ ఇచ్చారు. దీంతో కూలి పనులు చేసుకునే వారు సంబరపడ్డారు. ఏడు నెలలు అవుతున్నా క్యాంటీన్ గురించి పట్టించుకోకుండా పేదల ఆశలపై నీళ్లు చల్లారు.

ఎన్నికల అస్త్రంగా...

పంచాయతీ నుంచి సార్వత్రిక ఎన్నికల వరకు తెలుగు గంగ నీటి సరఫరా అనేది నాయకుల ప్రధాన హామీలో భాగమైపోయింది. గత ఎన్నికల్లో ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని తనను గెలిపిస్తే ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీకి ఆరు నెలల్లో తెలుగు గంగనీటి సౌకర్యం కల్పిస్తానని, అందరి దాహార్తిని తీరుస్తానంటూ వాగ్దానం చేశారు. గెలిచిన తర్వాత ఆ విషయాన్ని పట్టించుకోలేదు. 2018లో పంచాయతీ నీటి సమస్యపై స్థానిక టీడీపీ నాయకులు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. ప్రభుత్వం ఈ బాధ్యతను అప్పటి పంచాయతీరాజ్‌శాఖా మంత్రి నారాలోకేష్‌కు అప్పగిచ్చింది. ఆయన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కూడా శెట్టిపల్లి పంచాయతీల ప్రజలకు ఇచ్చిన హామీని గాలికి వదిలేశారు.

చెవిరెడ్డి ఎంతో కృషి...

వైఎస్సార్‌సీపీ పాలనలో ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీల ప్రజలకు తెలుగు గంగ నీటిని అందించేందుకు అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అప్పటి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఎంతో కృషి చేశారు. అప్పటి కార్పొరేషన్ కమిషనర్ గిరీషాతో పలుమార్లు చర్చించారు. ఈ విషయాన్ని అప్పటి సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. తెలుగు గంగ నీరు శెట్టిపల్లి ప్రజలందరికీ అందించేందుకు తగిన చర్యలు చేపడుతున్నప్పటికీ ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయింది.

పరిశుభ్ర సుందర నగరమే లక్ష్యం



స్కావెంజర్స్ కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుపతిని సుందరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య తెలిపారు. ఆమె ఆదివారం స్కావెంజర్స్ కాలనీలో జరుగుతున్న పారిశుధ్య, సుందరీకరణ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సుందరీకరణలో భాగంగా అన్ని ఇండ్లకు అందమైన చిత్రాలు వేయిస్తున్నామని, కాలువల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రజల సహకారంతో స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తామన్నారు. డీఈ రాజు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా : నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రజలు 0877– 2227208 కి కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ఉదయం 10.30 నుంచి నేరుగా ఫిర్యాదులు అందజేయవచ్చని వెల్లడించారు.

విశ్వ గురువుగా భారత్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.కుప్పురం

తిరుపతి సిటీ: రాజకీయాలకు అతీతంగా యువత, నిపుణులు కృషి చేస్తే భారతదేశం విశ్వగురువుగా అవతరిస్తుందని కెన్యాకు చెందిన మసిండే ములిరో శాస్త్రసాంకేతిక వర్సిటీ ప్రొఫెసర్ జి.కుప్పురం తెలిపారు. ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియం వేదికగా పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, పూర్వ విద్యార్థుల సంఘం సంయుక్తంగా 'ఇండియా యాజ్ ఎన్ ఎమర్జింగ్ గ్లోబల్ పవర్– ది జర్నీ టువోర్డ్స్ వికసిత్ భారత్' అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భారత్‌లో మేధోశక్తిగల యువత, విద్యావేత్తలు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. వారి కృషితో ప్రపంచంలోనే అత్యధిక వనరులు గల భారతదేశం 2047 నాటికి వికసిత్ భారత్‌గా వెలుగొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బీవీ మురళీధర్, మహిళా వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డీఎం మమత, ఫ్రాన్స్‌కు చెందిన ప్రొఫెసర్ గుల్లాబ్ మీర్ రెహ్మాన్, శ్యామ్యూల్, అధ్యాపకులు సీఎల్ చెన్నారెడ్డి, డాక్టర్ ఐఎస్ కిషోర్, డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ వెంకటేశులు రెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

యథేచ్ఛగా భూ ఆక్రమణ



రామానుజపల్లికి సమీపంలో బండిబాటను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలు

తిరుపతి రూరల్: మండలంలోని రామానుజపల్లిలో టీడీపీకి చెందిన వారు బరితెగించారు. అధికారులతో కుమ్మక్కై రామానుజపల్లి గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబర్ 121/5లోని 1.29 సెంట్ల బండిబాటను ఆక్రమణకు సిద్ధమయ్యారు. దాని విలువ సుమారు రూ.4 కోట్ల వరకు ఉంటుంది. దీనిపై స్థానిక మహిళలు రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. సెలవు రోజుల్లో నిర్మాణాలను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులే సలహా ఇచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమిత భూమిలో ఇప్పటికే ఒక ఇల్లు పూర్తి చేశారు. తాజాగా మరో రెండు ఇళ్లకు పునాదులు వేశారు. అక్రమ కట్టడాలను అడ్డుకోకుంటే హైకోర్టులో కేసు వేస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

వేడుకగా ధన్వంతరి-మహాలక్ష్మి హోమం



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు, పండితులు

తిరుపతి కల్చరల్: పరిహార సేవా ఫౌండేషన్ టీటీడీ సౌజన్యంతో ఆదివారం ఇందిరా మైదానంలో ధన్వంతరి– శ్రీమహాలక్ష్మీ హోమం అత్యంత వేడుకగా నిర్వహించారు. వేదికపై ధన్వంతరి, శ్రీమహాలక్ష్మి ప్రతిమలను కొలువు తీర్చి పూజలు, హోమ క్రతువులు చేపట్టారు. అనంతరం శాస్త్రోక్తంగా హోమం చేశారు. ద్వారకా బధిర ఆశ్రమం శంకరాచార్యుల పరంపరకు చెందిన విద్యానారాయణ తీర్థస్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ధన్వంతరి హోమ పూజలతో పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, అష్ట ఐశ్వరాలు కలుగుతాయన్నారు. అనంతరం పూర్ణాహుతితో హోమం పూర్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, డీసీసీబీ మాజీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, వైష్ణవి హాస్పిటల్ అధినేత డాక్టర్ మునిశేఖర్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎల్.వర్మ, పరిహార సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.చక్రవర్తి, పాల్గొన్నారు.

నేరాల జోలికెళ్లొద్దు



సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు

తిరుపతి అర్బన్: నేరాల జోలికి వెళ్లొద్దని పాత నేరస్తులు, రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లాలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాత నేరస్తు ల ఇంటికి వెళ్లి పలు సూచనలు చేశారు. 636 వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో 86 బైక్‌లు, 7 ఆటోలు, 2 కార్లను సీజ్ చేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలో అలిపిరి, పాకా ల, ఏర్పేడు, శ్రీకాళహస్తి రూరల్, గూడూరు, వెంకటగిరి, కోట, సూళ్లూరుపేట, నాగలాపురం, పుత్తూ రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తుంటే పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 80999 99977కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, తిరుపతి అలిపిరి సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. తిరుపతి సత్యనారాయ ణపురంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. రూ.18,445 నగదును స్వాధీనం చేసుకున్నారు.





నవ్విపోదురు గాక..!

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తుడా చైర్మన్‌గా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పని చేశారు. ఆయన ప్రజల సౌకర్యార్థం చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ బెంచీలు ఏర్పాటుచేయించారు. ప్రస్తుతం అధికారంలో వున్న కూటమి నేతలు కొన్ని గ్రామాల్లో వాటిని ధ్వంసం చేశారు. స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు ధ్వంసం చేయడాన్ని అడ్డుకున్నారు. దీంతో వారు రూటు మార్చి వాటికి పసుపు రంగులు వేస్తున్నారు. అంతటితో ఆగక తమ ప్రభుత్వంలోనే బెంచీలు ఏర్పాటు చేసినట్టు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేరు రాయిస్తున్నారు. దీన్ని చూసిన స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్న ఒక కవి రాసిన కవితను గుర్తు చేసుకుంటున్నారు. – చంద్రగిరి

దంత సమస్యలపై అవగాహన

తిరుపతి కల్చరల్ : ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం గోవిందరాజస్వామి వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు దంత సమస్యలపై అవగాహన కల్పించారు. హరిప్రియ దంత వైద్యశాల అధినేత ఎస్.గణేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దంతాలు, చిగుళ్ల సమస్యలతోపాటు పుచ్చిన పళ్లు, దీర్ఘకాలికంగా వాడే మందులతో కలిగే సమస్యలు, పరిష్కారాల గురించి వివరించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి తోట చక్రపాణి, విజయభాస్కర్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, గోపీయాదవ్, బండి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రచయితలను తయారు చేయడమే లక్ష్యం

తిరుపతి కల్చరల్: లక్షల మంది రచయితలను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని టీఎల్‌సీ మాస్టర్ మైండ్స్ చాప్టర్ సంస్థ తిరుపతి ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రాజు తెలిపారు. స్థానిక సంస్థ కార్యాలయంలో ఆదివారం టీఎల్‌సీ మాస్టర్ మైండ్స్ చాప్టర్ ప్రపంచ కార్యకలాపాల వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీ సుందరం, కార్యనిర్వహణాధికారి గుణశేఖర్ అధ్యక్షతన శిక్షణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మొదటి దఫాలో వెయ్యి మంది రచయితలను తయారు చేయడానికి శ్రీకారం చుట్టామన్నారు. మురళీ సుందరం, గుణశేఖర్ మాట్లాడుతూ మార్చి 11 నుంచి 14వ తేదీ వరకు చెన్నైలో రెసిడెన్షియల్ పుస్తక రచన శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తిగల వారు 7993003936లో సంప్రదించాలని కోరారు.

ఎమరాల్డ్స్‌లో ఘనంగా ఈక్వెస్ట్ వేడుకలు



విద్యార్థిని పూజశ్రీకి అవార్డును అందజేస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

తిరుపతి సిటీ: స్థానిక ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ కాలేజీలో ఆదివారం విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈక్వెస్ట్–2025 పోటీలను నిర్వహించారు. ఇందులో బిజినెస్ క్విజ్, యాడ్ గేమ్, బిజినెస్ ప్రపోజల్, స్పార్క్, స్టాక్ బజ్ విభాగాల్లో ప్రతిభ చూపిన వారితోపాటు అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థిని పూజశ్రీకి అచీవర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందజేశారు. కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్, ప్రిన్సిపాల్ జాఫర్‌వలి పాల్గొన్నారు.

వార్డులో బెడ్లు పెంచాలి

తిరుపతి తుడా : రుయాలోని అత్యవసర వార్డులో బెడ్లు పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి కోరారు. ఆయన ఆదివారం ఎమర్జెన్సీ వార్డును తనిఖీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమర్జెన్సీ వార్డులో ఒక్కొక్క బెడ్ మీద ముగ్గురు, నలుగురు చొప్పున రోగులను ఉంచి వైద్యం అందిస్తున్నారని తెలిపారు. రోగులకు వెంటనే బెడ్స్‌ను సమకూర్చకుంటే ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



తిరుపతి రూరల్ : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం జరిగిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తమిళనాడు రాష్ట్రం తిరుకలుకుంద్రంకు చెందిన నటేశా నృత్యాలయం కళాకారులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పుష్పాంజలి, సూర్య కౌత్వం, విషముకార కర్ణ, శ్రీమన్నారాయణ నమః తదితర పాటలకు నృత్యాలు ప్రదర్శించారు. వారిని శిల్పారామం ఏవో ఖాదర్‌వలి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

స్వయం ఉపాధితో మహిళలు రాణించాలి

తిరుపతి కల్చరల్: చేతి వృత్తుల్లో నైపుణ్యాలు పెంపొందించుకుని మహిళలు రాణించాలని చేతన సోషల్ ట్రస్ట్ నిర్వాహకుడు సుబ్రమణేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్‌జీవోస్ కో ఆపరేటీవ్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం ట్రస్ట్ పదో వార్షికోత్సవం నిర్వహించారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధినేతలు రమేష్, శోభారాణి, బైరవ అనిల్ కేర్ ట్రస్ట్ అధినేత సేతురాం, మోహన్, ప్రశాంతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

'కథలు ఆలోచింపజేస్తాయి'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: కథలు పలువురిని ఆలోచింపజేస్తాయని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ ఆచార్య జంపాల వెంకటరమణ, హాస్యానంద మాసపత్రిక సంపాదకుడు రాము తెలిపారు. బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్‌కామర్స్ కార్యాలయంలో ఆదివారం జేసీఐ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామి రచించిన 'మీది తెనాలి– మాది తెనాలి' కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ కొసమెరుపు కామెడీ కథలు పాఠకులను ఆకర్షిస్తాయన్నారు. ఆచార్య మూలె విజయలక్ష్మి మాట్లాడుతూ రాజు కథల్లో గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనబడతాయన్నారు. ఈ పుస్తకాన్ని కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకుడు డాక్టర్ చింతకుంట శివారెడ్డి సమీక్షించారు. రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు మాట్లాడుతూ కథలు చదువుతూ తాను ఇప్పటి వరకు 17 కథల పుస్తకాలు రాసినట్టు తెలిపారు. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు జేసీఆర్.శేషసాయి, కార్యదర్శి వి.దిలీప్ కుమార్, కోశాధికారి ఎస్.దిలీప్‌కుమార్, ఆచార్య స్వరాజ్యలక్ష్మి, రచయితలు డాక్టర్ మౌని, అభ్యుదయ రచయితల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వరల్డ్ అచీవర్స్ కాన్వొకేషన్



కాన్వొకేషన్ అందుకుంటున్న కలకట నితిన్

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లోని కౌటిల్య విద్యా సంస్థలో ఆదివారం వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2025 వరల్డ్ అచీవర్స్ కాన్వొకేషన్ నిర్వహించారు. ఫెన్సింగ్ క్రీడలో జాతీయ స్థాయి పోటీల్లో ఏడుసార్లు ప్రతిభ చూపి స్పోర్ట్స్ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థి కలకట నితిన్‌ను ఘనంగా సత్కరించారు. ఇందులో తుడా కార్యదర్శి డాక్టర్ జి.వెంకటనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులు సాధించిన నితిన్ అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. పట్టుదల, కార్యశుద్ధి ఉంటే ప్రపంచ విజేతలు అవుతారని పేర్కొన్నారు. అనంతరం నితిన్‌తో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన 10 మందికి వరల్డ్ అచీవర్స్ కాన్వొకేషన్ అందజేశారు. కార్యక్రమంలో రైల్వే సీఐ మధుసూదన్, వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైడి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు, హస్తకళా ప్రదర్శన ప్రారంభం



చేనేత వస్త్రాలు, హస్తకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న కస్టమర్లు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: త్యాగరాజ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు, హస్తకళా ప్రదర్శనను ఆదివారం ప్రారంభించారు. డ్వాక్రా గ్రామీణ చేనేతల మేనేజర్ ఉమేష్ మాట్లాడుతూ చేనేత, హస్త కళాకారులు తయారు చేసిన వస్తువులను వారే స్వయంగా విక్రయించుకునేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ప్రదర్శన మార్చి 2వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. నిర్వాహకులు అహ్మద్, అశోక్ రింకు, సాకీర్ పాల్గొన్నారు.

జీవో విడుదలయ్యే వరకు తగ్గేదేలే..!



మంత్రి లోకేష్‌ను కలిసిన వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ: యూజీ, పీజీ, పీహెచ్‌డీ ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులకు గౌరవ వేతనాన్ని పెంచాలని కోరుతూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో జూడాలు చేపట్టిన నిరవధిక నిరసన 14వ రోజుకు చేరింది. వారు ఓపీ, ఓటీలను సైతం బహిష్కరించారు. ఇందులో భాగంగా ఆదివారం నెల్లూరు పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. అన్ని విభాగాల్లో వైద్య విద్యార్థులకు ఇస్తున్న స్టైఫండ్‌కు సమానంగా తమకు ఇవ్వాలని డిమాండు చేశారు. సుమారు వంద మందికి పైగా విద్యార్థులు ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు. త్వరలో జరిగే క్యాబినెట్ మీటింగ్‌లో సంబంధిత మంత్రితో కలిసి ఈ విషయంపై చర్చిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

జీవో విడుదలయ్యే వరకు సమ్మె కొనసాగిస్తాం

అనంతరం వెటర్నరీ జూడాలు మీడియాతో మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యను మంత్రికి వివరించామని, పరిశీలించి క్యాబినెట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గౌరవ వేతనం పెంచే వరకు తాము సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. ఇప్పటికే ఎంతో మంది మంత్రులను కలిసి విన్నవించినా ఫలితం లేదన్నారు. వర్సిటీ అధికారులు విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా స్వంత వ్యాపకాలపై బిజీగా ఉన్నారని మండిపడ్డారు. ఇప్పటికే అన్ని పశువైద్యశాలల్లో ఓపీలు, ఓటీలు నిలిపివేశామని సమస్య పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఎమర్జెనీ సేవలను కూడా నిలిపివేస్తామని హెచ్చరించారు. గౌరవ వేతనం పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసే వరకు తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.